# సద్దుల బత్కమ్మ...

బతుకమ్మకు ఆహ్వానం....
తన కురులను అలంకరిద్దామని
తనకోసమేపూచిన తంగేడి వనం,
పుడమినిపసుపు పచ్చని రంగుతో ముగ్గేసినట్టు
అలంకరించిన శుభ సందర్భం
తంగేడు, నూగు, బంతి, చామంతి
గుత్తులు గుత్తులుగా....

విరిసీ విరియని మొగ్గలనుకని
నవ్విన చందంగా, తలలూపే కొమ్మల
రెమ్మల పరిహాస ధరహాసాలమధ్య
పుట్టుకకు సిద్ధమయిన బతుకమ్మను
ఆనందోత్సాహాలతో పిచ్చుకరావాలు
మేళ తాళాలతో ఆహ్వానించే వనం
స్వాగతోపన్యాసాలతో ఒక్కొక్క పువ్వేసి......

తన పుట్టు పూర్వోత్తరాలను కథలుగా పాడుకునే
ఆటల,పాటల, నవ్వులాటలలో
అలసి, ఆనందిద్దామని పుట్టింది గౌరమ్మ
బతుకమ్మగా పేరిగే తన కథలెన్నో
విందామని, శ్రీలక్ష్మీ మహిమలను
పాడుకునే అమ్మలక్కలను కలసి,
తనరాక కోసం ఇంటింటా
పూలపాన్పులను రెండేసి పూలుగా........

ఓలలాడించే తన తోటి స్త్రీలను
కౌగిలించుకుని, హాయిగానవ్వుతూ,
పడుచు పిల్లల కవ్వింపు పులకరింతలను
పసికూనలను చూసి పలకరింపుగా
నవ్వుతూ, పుట్టెడు ఆశతో
మూడేసిపూలుగా పుట్టింది బతుకమ్మగా..

పుట్టింటి వారింట పుట్టినందుకు
మెట్టింటికి తనవారు తనను సాగనంపే
పాట పాడగా, వినినంతనే బిత్తరపోయి
ఇదేమి వైనం, నీటముంచే న్యాయం అని
కన్నెర చేసింది బతుకమ్మ......

నవధాన్యాలను కొంగున మూటగా కట్టి
ఒడిబియ్యంగా కొనిపోదామని చూసినంతనే
వాటిని తానెరగని వారెవరో అభివృద్ధి అంటూ
అంగట్లోపెట్టగా చూసి....
హతాశురాలైంది తాను బతుకమ్మ..

తెలంగాణ వాదం విని, రాజకీయం కని
తన తల్లి ఆస్తిపై నాయకుల కళ్లకలం
కని, బిక్కుబిక్కుమంటూ బిడియపడుతూ...
కలవరపడుతూ...పరిపరివిధముల,నిరసనగా
చూసింది బతుకమ్మ......

పండగ చేసి ఏమార్చి, ప్రాయం రాకముందే
తనను నీటముంచినట్టు తెలంగాణను
తల్లి అని పిలిచిన వీరు ఏటముంచగలరేమో అనీ..
బతుకమ్మ గా మళ్లీ తెలంగాణాలో పుట్టి
పుడమితల్లి వేలంవెర్రిని అపగలనేమో అని
నాలుగేసి, అయిదేసి, ఆరేసి, ఏడేసి, ఎనిమిదేసి,
తొమ్మిదేసి పంటలుగా స్వేచ్ఛగా
ఎదగాలనే వాంఛతో నీటిలో నిశ్శబ్దంగా
మునిగింది గౌరమ్మగా..

వి.ఉషారాణి
హైద్రాబాద్